# కేరళ | అదానీ గ్రూపు భారీ ఓడరేవు నిర్మాణం – మత్స్యకారుల ఆందోళన

**కేరళ** రాజధాని తిరువనంతపూర్‌కు 20 కిలోమీటర్ల దూరంలో విళింజం ప్రాంతంలో అరేబియా మహాసముద్ర తీరంలో అదానీ గ్రూపు సంస్థ అంతర్జాతీయ ఓడరేవు నిర్మాణాన్ని తలపెట్టింది. 7290 కోట్ల రూ॥ల భారీ అంచనాతో నిర్మించ తలపెట్టిన ఈ ట్రాన్స్‌–షిప్‌మెంట్ ప్రాజెక్టు ప్రభావంతో పర్యావరణం పూర్తిగా దెబ్బతింటుందని, అరుదైన మత్స్యసంపద కనుమరుగు అవుతుందని, జలచరాల ఉనికికే ప్రమాదమేర్పడుతుందని ఆ ప్రాంత మత్స్యకారులు ఆందోళన చెందుతున్నారు.

ఈ ఓడరేవు ప్రతిపాదన ముందుకొచ్చిన నాటినుండీ 100 రోజులకుపైగా ఈ ప్రాంత మత్స్యకారులు, స్థానిక చర్చి ఫాదర్‌లు, క్రిస్టియన్ మతపెద్దలు ఈ ప్రాజెక్టును వ్యతిరేకిస్తూ వివిధ రూపాల్లో నిరసన కార్యక్రమాలు చేపడుతూ వస్తున్నారు. కేంద్రంలోని బిజెపి, స్థానిక వామపక్ష ప్రభుత్వాల అండదండలతో అదానీ కంపెనీ ఓడరేవు ప్రాజెక్టు నిర్మాణ పనులు సాగిస్తూండటం, తమ నిరసనలను ఖాతరు చేయకపోవడంతో వారంతా తమ ఆందోళనలను తీవ్రం చేశారు.

కొద్దికాలం క్రితం కేరళ హైకోర్టు ఇచ్చిన ఆదేశాలతో నిలచిపోయిన ఓడరేవు నిర్మాణ పనులు, అదానీ యాజమాన్యానికి అనుకూలంగా హైకోర్టు తీర్పునివ్వడంతో తిరిగి ప్రారంభమయ్యాయి. 2022 నవంబర్ 1వ తేదీన మత్స్యకారుల ఉద్యమాన్ని నిరసిస్తూ, భారీ పోర్టు నిర్మాణాన్ని సమర్ధిస్తూ పాలక సిపిఎం, బిజెపి నాయకుల ఆధ్వర్యంలో ప్రదర్శన జరగడం విశేషం!

కాగా, నవంబర్ 26న ఓడరేవు నిర్మాణ ప్రాంతాన్ని పరిసర తీరప్రాంత గ్రామాల నుండి తరలివచ్చిన వేలాదిమంది మత్స్యకారులు చుట్టుముట్టారు. నిర్మాణ సామాగ్రితోనున్న 50 లారీలను అడ్డుకొని, నిర్మాణ సామాగ్రిని దించకుండా నిలువరించారు. దీనితో యాజమాన్య మద్దతుదార్లు, ఓడరేవుకు సమర్ధనగా రంగంలోకి దిగి ఘర్షణకు తలపడ్డారు. కొన్ని గంటలపాటు సాగిన ఈ దాడి యుద్ధ వాతావరణాన్ని తలపించింది. ఈ ఘటనలో పోలీసులతో సహా అనేకమంది మత్స్యకారులు గాయపడ్డారు. శాంతిభద్రతలను కాపాడే పోలీసు అధికారుల పక్షపాత వైఖరితో మరింత ఆగ్రహించిన ఆందోళనకారులు పోలీసులపై తమ ఆగ్రహాన్ని వెళ్ళగక్కారు; అనేకమంది పోలీసులను తరిమారు; కొన్ని పోలీస్ జీపులను దగ్ధం చేశారు. వెయ్యి మంది పోలీసులు మోహరించినా ఆందోళనను అణచివేయటం కష్టమైందంటేనే పరిస్థితి తీవ్రత అర్ధమౌతుంది. కాల్పులు జరిపితే మరింత భ్రష్టుపడతామనే అంచనాతో పాలక ప్రభుత్వాలు లాఠీఛార్జీ వరకే పరిమిత మయ్యారు. ఏమైనా ఈ ఘటన తదనంతరం హత్యాయత్నం, చొరబాటు, విధ్వంసం, దాడులు, నేరపూరిత కుట్రతో సహా పలు అభియోగాలు మోపి 3 వేల మంది మత్స్యకారులతో సహా వారికి మద్దతుగా నిల్చిన అనేకమంది చర్చి ఫాదర్‌లపై పోలీసులు కేసులు బనాయించారు.

విళింజం వద్ద భారీ ఓడరేవు నిర్మాణంలో భాగంగా అశాస్త్రీయంగా నిర్మించే గ్రోయన్లు, కృత్రిమ సముద్రగోడలు, కోస్తాతీరం కోతకు గురికావటానికి ఒక కారణమని పర్యావరణ నిపుణులు హెచ్చరిస్తున్నారు. ఓడరేవు నిర్మాణాన్ని ఆపివేసి, కోస్తా తీరంపై ఈ అంతర్జాతీయ స్థాయి ఓడరేవు ప్రభావం గురించి అధ్యయనం చేయించాలని మత్స్యకారులు డిమాండ్ చేస్తున్నారు. వీరి న్యాయమైన డిమాండ్లను పెడచెవిన బెట్టి, బలప్రయోగంతో ఓడరేవు నిర్మాణానికి పూనుకోవటంతో తమ దుస్థితిని అధికారులకు తెలియజెప్పేందుకు తమకు మరోమార్గం కన్పించ లేదని వందరోజులకు పైగా శాంతియుతంగా ఆందోళన చేస్తున్న మత్స్యకారులు తమ ఆవేదన వెలిబుచ్చారు. తీరం లేకుంటే జీవనం లేదని, తామంతా జీవనోపాధిని శాశ్వతంగా కోల్పోతామని వారు చెబుతున్నారు. వారి ఆందోళనలోని వాస్తవికతను గుర్తించి, వారికి శాస్త్రీయ నిర్ధారణలతో నమ్మకం కలిగించేందుకు అదానీ గ్రూపు యాజమాన్యము గానీ, పాలక కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు కానీ పూనుకోలేదు. ఉద్యమాన్ని అణచివేసి ఓడరేవు నిర్మాణం చేయగలుగుతామని భావిస్తూ వారు ముందుకు వెళుతున్నారు.

* * * * *